**మానవులకు మూడో నేత్రం విద్య – నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పురుషాళికిన్/
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశ బంధుడున్/
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లేదిలన్ /
విద్య నృపాల పూజితము విద్య నెఱుంగనివాడు మర్త్యుడే /

అంటోంది భర్తృహరి శతకం .

ఆ పద్యం యొక్క భావం తెలుసుకుందాం. రహస్యంగా దాచిపెట్టిన ధనం వంటిది విద్య. విద్యయే సౌందర్యం. యశస్సు, భోగాలు విద్య ద్వారా లభిస్తాయి. గురువు లాగా అన్నింటిని బోధిస్తుంది. పరదేశంలో చుట్టంలా సహాయం పడుతుంది. విద్యయే పర దైవతం. ప్రపంచంలో విద్యకు సమానమైన ధనం ఇంకేదీ లేదు. రాజ్యసభల్లో పూజింపబడేలా చేస్తుంది విద్య. కాబట్టి విద్య రాని వాడు మరణించిన వారితో సమానం అన్నారు శతకకర్త . ఈ పద్యంలో రాసిన పురుషుడు అంటే మగవారు మాత్రమే అని భావించకుండా మనుష్యుడు అనుకోవాలి. అప్పుడు స్త్రీ పురుషులిద్దరికీ విద్య యొక్క ప్రయోజనాలన్నీ వర్తిస్తాయి.

పై పేరాలో చెప్పుకున్నట్లు విద్య మిగతా ధనాల్లాంటిది కాదు. ఎవరికీ కనిపించకుండా అతి రహస్యంగా ఉంటుంది. కాగితాలు , నాణాల రూపంలో ఉన్న ధనమైతే ఎంత రహస్యంగా దాచిపెట్టినా, ఎవరో ఒకరికి, ఎలాగోలా తెలిసిపోతుంది. ఆ ధనాన్ని దొంగలు దోచుకుపోవచ్చు. విద్యా ధనాన్ని మాత్రం ఎవ్వరూ దొంగిలించలేరు. ఇలా చాలా ప్రయోజనాలున్నాయి కాబట్టే విద్య రాని వాడిని మరణించిన వాడితో సమానమని అన్నారు శతకకర్త. విద్యకు సాటి వచ్చే ధనం లోకములోనే లేదన్న మాట. “విద్యాధనం సర్వధన ప్రధానం’ అన్న నీతి వాక్యం కూడా ఈ విషయాన్ని తెలుపుతుంది.

పిల్లలూ, ఇప్పటికే మీకు బోధపడి ఉంటుంది. ఈ నెల మనం తెలుసుకోబోతున్న అంశం విద్య . శిలలాంటి మానవుల్ని శిల్పంగా సంస్కరించే సాధనం విద్య. విద్యార్జన జ్యోతి వలె ప్రకాశించి రాణింప జేస్తుందని గుర్తించడం వల్లే మన పెద్దలు ‘విద్య లేనివాడు వింత పశువు’ అన్నారు. అంతేకాదు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపొందించే గొప్ప పనిని విద్య మాత్రమే చెయ్యగలదు.

విద్య అంటే కేవలం పాఠశాలల్లో చదువుకోవడం మాత్రం కాదు. ఇది మనల్ని మనం తెలుసుకోవడానికి, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఒక అద్భుతమైన ప్రయాణం. విద్య మన ఆలోచనల్ని విస్తృతం చేస్తుంది. మనలో దాగిన నైపుణ్యాలను బయటకు రప్పిస్తుంది. జీవితంలో ముందుకు ధైర్యంగా అడుగులు వేయడానికి సహాయపడుతుంది.

జీవితానికి పునాది లాంటిది విద్య. ఒక ఇంటిని గట్టి పునాదుల మీద నిర్మిస్తే స్థిరంగా నిలబడి ఉంటుంది. మన భవిష్యత్తును కూడ విద్య ద్వారా తీర్చిదిద్దుకుంటే అది స్థిరమైనదిగా ఉంటుంది. విద్య ద్వారా మనం జ్ఞానం, నైపుణ్యం, నైతికత, ఆత్మవిశ్వాసం పొందగలం. అదొక అమూల్య సంపద.

అంతే కాదు. విద్య వల్లనే మనకు ప్రపంచాన్ని అర్థం చేసుకునే శక్తి వస్తుంది. విజ్ఞానాన్ని పెంపొందించి, వివిధ విషయాలపై అవగాహన పెంచుతుంది . విద్య ద్వారా మనం కొత్త విషయాలను నేర్చుకుంటాం. జ్ఞానాన్ని పెంచుకుంటాం. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. వ్యక్తుల్లోని నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. సమస్యలను పరిష్కరించడం, ఆలోచించడం సహా చక్కని భావవ్యక్తీకరణకు సహాయ పడుతుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. సమస్యల్ని ఎదుర్కొనే ధైర్యాన్ని కలిగిస్తుంది.

ఉన్నత విద్య నేర్చుకోవడం ద్వారా మంచి ఉద్యోగాలను పొందేందుకు అవకాశం కలిగిస్తుంది. మెరుగైన జీవన స్థాయికి చేరేందుకు తోడ్పడుతుంది. జ్ఞానవంతులుగా , తెలివైనవారిగా ఉంటే, మెరుగైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. విద్య ఇచ్చిన జ్ఞానం వల్ల విలువలు అలవడతాయి. సమాజ సేవలో భాగస్వామ్యం కాగలుగుతారు.

విద్యాబోధనలో నియత, అనియత పద్ధతులున్నాయి. నియత విద్యలో విద్యాబోధనకు ప్రణాళిక, పాఠ్య గ్రంథాలు, ఉపకరణాలు ఉంటాయి. అనియత విద్య మాత్రం దీనికి విరుద్ధంగా ఉంటుంది. చదవడం, రాయడం రాని వారిని కూడ విద్యావంతుల్ని చేసే విధానమిది. నియత విద్య బోధించేది మాత్రమే. అనియత విద్య వ్యక్తిని నిర్మించే విద్య! నియత విద్య ద్వారా విషయాలు స్పష్టంగా అర్థమైతే, అనియత విద్యలో వింటున్నవి గుండెను తాకుతాయి. వీధి నాటకాలు, పురాణాలు, హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మలాటలు, వీధిభాగోతాలు మొదలైనవన్నీ అనియత విద్యలో భాగమే . ఒకప్పటి రోజుల్లో నిరక్షరాస్యుల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దేవి కళారూపాలు. అప్పటి రోజుల్లోని ప్రజల లోకజ్ఞానం చదువుకున్న వాళ్లతో సమానంగా ఉండేదంటే కారణం అనియత విద్య ద్వారా వాళ్లు గడించిన జ్ఞానమే.

ఒకప్పుడు దేవాలయాలు విద్యాలయాలుగా కూడ పని చేసేవి. అక్కడ ఉత్సవాల్లో జరిగే పురాణ కాలక్షేపాలు, నాట్యాలు, సంగీత కచేరీలు పామరుల్ని కూడ సంస్కృతీ సంపన్నులుగా తీర్చిదిద్దేవి.

చదవని వాడజ్ఞుండగు /
చదివిన సద సద్వివేక చతురత కలుగున్ /
చదువగ వలయును జనులకు/
చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ /

పై పద్యంలో చెప్పినట్టు అందరికీ విద్య అందాలన్న మంచి ఆశయం పురాణ కాలం నుంచి ఉంది. అందుకు ఉదాహరణగా భాగవతం లోని ప్రహ్లాద హిరణ్య కశిపుల సంవాదం చెప్పవచ్చు. చదువుకుంటే వివేకం, చతురత కలుగుతాయని రాక్షసరాజు హిరణ్యకశిపుడి చేత పోతన గారు పలికించారు. మంచి, చెడుల విచక్షణ గ్రహించేలా చేస్తూ తెలివిని ప్రసాదిస్తుందని చెప్పారు. 'విద్యను మూడవ కన్నుగా, జ్ఞానార్జనకు మార్గంగా' భావించిన నాటి కవులు తమ కావ్యాలలో ప్రచారం కల్పించి ఎంతగానో ప్రోత్సహించారు.

చదివించిరి నను గురువులు/
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రమ్ములు నే/
చదివినవి గలవు పెక్కులు/
చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ/

అని తండ్రికి బదులిచ్చాడు ప్రహ్లాదుడు. తనని అన్ని శాస్త్రాలలోనూ ప్రవీణుడిగా గురువులు తీర్చిదిద్దినట్టు, విద్యలోని లోతుపాతులను సరిగా అర్థం చేసుకున్నానని బదులిచ్చాడు . విద్య విలువను చక్కగా వివరించారు పోతనామాత్యులు.

రాజుల కాలంలో విద్యా ప్రపూర్ణులయిన వారినే పట్టాభిషిక్తుల్ని చేసేవారని చదువుకున్నాం. ఆ కాలంలో చాణక్యుడి వద్ద చంద్రగుప్తుడు, రామదాసు వద్ద ఛత్రపతి శివాజీ, అరిస్టాటిల్ వద్ద అలెగ్జాండర్ మొదలైన ఎందరో పాలకులు విద్యలు నేర్చుకున్నారని సమర్థవంతంగా పరిపాలించారని చరిత్ర తెలిపింది.

అవతార పురుషులు కూడా గురు సన్నిధిలో విద్య నభ్యసించారని పురాణాలు, ఇతిహాసాలు బోధించాయి. విశ్వామిత్రుని దగ్గర రామలక్ష్మణులు, సాందీపుని దగ్గర బలరామకృష్ణులు, పరశురాముని దగ్గర భీష్ముడు, ద్రోణుని దగ్గర కౌరవ పాండవులు, గోవింద భగవత్పాదాచార్యుని దగ్గర ఆదిశంకరులు, వీరబ్రహ్మం గారి దగ్గర సిద్దయ్య శిష్యులుగా చేరినట్టు , సపరి చర్యలు చేసినట్టు , గురు కటాక్షంతోనే జ్ఞానం సంపాదించుకున్నట్టు తెలిపాయి. పూర్వకాలానికి చెందిన ఆ కథల్ని, చరిత్రల్ని ఈ కాలం పిల్లలకు చెబితే గురువుల దగ్గర మెలగాల్సిన తీరు వాళ్లకు కూడ తెలుస్తుంది.

పూర్వకాలంలో బడి ఈడు పిల్లల్ని పాఠశాలకు పంపక ముందే ఇంట్లో అక్షరాస్యురాలైన తల్లి , తొలిగురువై అన్నీ నేర్పించేది. 'అనగనగా ఒక రాజు, ఆ రాజుకు ఏడుగురు కుమారులు… " వంటి కథలతో బాటు రామాయణ, భారత, భాగవత కథలు, దేశభక్తి కథలు చెప్పేది. "చందమామ రావే జాబిల్లి రావే", "ఏనుగమ్మా ఏనుగు.. మాఊరొచ్చింది ఏనుగు" వంటి పాటలు పాడుతూ పిల్లల్ని జోకొట్టేది. ఆహారం తినిపించేది. "చేతవెన్న ముద్ద చెంగల్వ పూదండ" వంటి పద్యాలు పాడుతూ ఆటలాడిస్తూ , పిల్లల మనసుకి ఆనందం కలిగించేది. రకరకాల ఆటబొమ్మల్ని , వస్తువుల్ని చూపిస్తూ అవేంటని ప్రశ్నలడుగుతూ జవాబులు చెప్పించేది. విద్య పట్ల ఇష్టం, అనురాగం కలిగించేది. అప్పట్లో గురువు చదువు నేర్పడానికి ముందే పిల్లలను బడికి వెళ్లేలా సిద్ధం చేసేవారు ఇంట్లో పెద్దలు . (తల్లిదండ్రులు, తాతయ్య, నానమ్మ, అమ్మమ్మలు).

విద్య పరమార్థం విజ్ఞానమే కాని ఉద్యోగం కాదు. అయితే నేటి కాలంలో విద్య యొక్క నిర్వచనం, పరమార్థం మారిపోయింది. ఒకప్పుడు విజ్ఞాన సముపార్జన కోసం విద్య అభ్యసించేవారు. ఇప్పుడు కేవలం ఉద్యోగం కోసం విద్యను అభ్యసిస్తున్నారు. ఇది మనందరం బాధపడాల్సిన విషయం.

"మన గురువుల స్థాయి కూడ కొంత వరకు తగ్గినట్టు అనిపిస్తుంది. ఉత్తమ గురువుల్ని రప్పిస్తే తప్ప విద్యార్థులకు తగిన విద్యాబోధన సాధ్యం కాదు " అంటారు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి . ఆయన మాటలు నిజమేనా అన్న సంశయం కలుగుతుంది. ఎప్పటికప్పుడు తమని తాము మెరుగుపరచుకుంటూ విద్యార్థుల బాగు కోరేవారే నిజమైన గురువులు. అలాంటి వారు తమలోని అంతర్గత నైపుణ్యాలను నిరంతరం మెరుగు పరుచుకోవడంలో ముందుంటారు. కాకపోతే గురువుల్ని సమర్థవంతంగా ఉపయోగించుకుని ఎదగడం విద్యార్థులకు తెలియాలి.

"జీవితాన్ని గురించి నేర్చుకోవడమే చదువు" అని సుప్రసిద్ధ విద్యా తాత్వికుడు విశ్వగురువు జిడ్డు కృష్ణమూర్తి చెప్పిన విషయం ఇక్కడ ప్రస్తావించాలి . ఆ విషయమై తీవ్రంగా ఆలోచించాలి. జీవితాన్ని గురించి నేర్చుకునే చదువులు ఇప్పుడు ఎక్కడ వున్నాయి ? ఉన్నవన్నీ ఉద్యోగాల మీద ఆశతో చదివే చదువులే. అది కూడా అర్థం చేసుకుని హృదయంలో నిక్షిప్తం చేసుకుని సమయానికి తగు విధంగా ఉపయోగించలేక పోతున్నారు విద్యార్థులు. కష్టం వస్తే దాన్ని దాటే మార్గం వెతకడం మానేసి , కోపం వస్తే తగ్గించుకునే మార్గం అన్వేషించడం మానేసి క్షణికావేశంలో చెయ్యకూడని తప్పులు చేస్తున్నారు. నిండు నూరేళ్ళ జీవితాలను అర్థాంతరంగా ముగిస్తున్నారు . జీవితాన్ని గురించి చదివితే అవగాహన చేసుకుంటే అలా తప్పుల మీద తప్పులు చెయ్యరు కదా.

ఇంకా విచారించాల్సిన విషయమేమంటే ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థుల చేత బట్టీ పట్టించి ర్యాంకుల కోసం ఎక్కువ మార్కులు పొందేలా శిక్షణ ఇస్తుంటారన్న అపవాదు ఉంది. పెద్ద చదువులు పూర్తి చేసిన వారిలో అధిక శాతం విద్యార్థులు ఉద్యోగాలు పొందినప్పటికీ తగినంత భాషా పరిజ్ఞానం, విషయ అవగాహన, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు లేకపోవడంతో కొద్ది రోజులకే ఉద్యోగాల నుండి బయటకు పంపబడుతున్నారని ఒక కంపెనీ సి. ఇ. ఓ. ఇచ్చిన ఇంటర్వ్యూలో చదివాను. అలా కాకుండా చదువును అర్థం చేసుకుని జీవితానికి అన్వయించుకుని ముందుకు దూసుకెళ్లే విధంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని వృత్తిలో రాణిస్తే ఎలాంటి ఇబ్బందులు , భయాలు ఉండవు. అలాంటి వాస్తవిక ఆలోచనా దృక్పథం విద్యార్థుల్లో పెరగాలి.

"విద్య ఆధునిక సమాజంలో పేదరికాన్ని తగ్గించేందుకు ముఖ్యమైన ఆయుధం" అని పెద్దలు చెప్పిన మాటలు నిజమేననిపిస్తాయి. మన సమాజంలో అనేక కుటుంబాలు ఒకప్పుడు చాలీచాలని ఆదాయంతో ఇబ్బందులు పడ్డాయి. పెరుగుతున్న ఖర్చులకు సరిపోని ఆదాయంతో గొర్రె తోక బెత్తెడు చందంగా జీవితాలను గడిపారు. సరళీకృత ఆర్థిక విధానాల పుణ్యమా అని సాఫ్ట్ వేర్ రంగం అభివృద్ధి చెందడంతో తమ పిల్లల్ని విద్యాధికులుగా తయారు చేసిన కుటుంబాలకు గణనీయంగా ఆదాయం పెరిగింది. సంపద చేరింది. అలాంటి కుటుంబాల స్థాయి దిగువ తరగతి నుండి మధ్య తరగతికి చేరింది. వారందరికీ చేతిలో డబ్బు ఉండడంతో గృహ సదుపాయాలను పెంచుకున్నారు. ఆధునిక ఉపకరణాలు ఉపయోగిస్తూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. అదంతా విద్య కలిగించిన ప్రయోజనమే కదా.

దొంగపాలు కాదు దొడ్డ కీర్తిని దెచ్చు/

పరమ సౌఖ్యమిచ్చు భద్రమిచ్చు/

యాచకునకు నీయ నావంత తరుగదు/

విద్యబోలు ధనము పృథివి గలదె./

అని శతకకర్త చెప్పినట్టు విద్య వల్ల సుఖసంతోషాలు కలగడమే కాకుండా , కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. విద్య వల్లనే గొప్ప పదవుల్ని, కీర్తి ప్రతిష్టల్ని పొందిన వారున్నారు. అలాంటి మహానుభావుల గురించి చదివితే విద్య యొక్క ప్రయోజనం వివరంగా తెలుస్తుంది.

మన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం గారు నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ , ఆయన అభ్యసించిన విద్య వల్లనే అత్యున్నత శిఖరాలు చేరుకున్నారు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎదిగారు. విలువలు కాపాడిన రాష్ట్రపతిగా నిరాడంబరంగా జీవితం గడిపారు. ఆయన జ్ఞానంతో భారతదేశం గర్వపడేలా చేశారు. “ఉపాధ్యాయుడే దేశానికి వెన్నెముక. జాతి స్వప్నం యథార్థరూపం ధరించడానికి ఉపాధ్యాయుడే ఆధార స్థంభం” అని చెప్పేవారు.

తమిళనాడు కి చెందిన సుందర్ పిచాయ్ ఉన్నత విద్య పూర్తయ్యాక గూగుల్ మరియు Alphabet Inc. సంస్థలకు సి. ఇ. ఓ. గా పనిచేస్తున్నారు. గూగుల్ ఉత్పత్తులు (Chrome, Android) అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారంటే కారణం ఆయన విద్య వల్ల పొందిన మేధస్సు.

సత్య నాదెళ్లా గారు టెక్నాలజీ రంగంలో చదువు పూర్తి చేసుకుని మైక్రోసాఫ్ట్ సంస్థకు సి. ఇ. ఓ. గా పని చేస్తున్నారు . క్లౌడ్ కంప్యూటింగ్‌పై దృష్టి పెట్టి మైక్రోసాఫ్ట్‌కు కొత్త దిశ చూపించారంటే కారణం ఆయన అభ్యసించిన ఉన్నత విద్యయే కదా.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విద్యార్జన చేసిన **అర్జున్ అరోరా గారు** గూగుల్ డీప్ మైండ్ సంస్థకు సి. ఇ. ఓ. గా ఉన్నారు.కృత్రిమ మేధ (AI) రంగంలో గూగుల్‌కు నాయకత్వం వహిస్తూ ఉన్నతస్థాయికి తీసుకెళ్తున్నారు.

ఉన్నత విద్య పూర్తి చేసిన **శాంతనూ నారాయణ్ గారు** Adobe Inc. సంస్థకు సి. ఇ. ఓ. గా పనిచేస్తున్నారు. Adobe Creative Cloud వంటి ప్రోడక్ట్స్ విస్తరణకు నాయకత్వం వహించారు.

ఉన్నత విద్య పూర్తి చేసిన **అర్జున్ భాస్ గారు** ఐ. బి. ఎం. సంస్థకు సి. ఇ. ఓ. గా ఉన్నారు . IBMని క్లౌడ్ మరియు కృత్తిమ మేధ( AI )రంగాల్లో నూతన మార్గాల్లో ముందుకు తీసుకెళ్తున్నారు.

వీరంతా తమ విద్య, నైపుణ్యం, దూరదృష్టి ద్వారా గ్లోబల్ కంపెనీలను విజయపథంలో నడిపిస్తున్నారు. వీరే కాదు చాలా మంది విద్యాధికులు తమ జ్ఞానం మరియు నైపుణ్యాలతో ప్రపంచాన్ని మార్చారు. అనుకోవాలి గానీ విద్యాధికులు తమ జీవితాన్నే కాకుండా, సమాజాన్ని కూడా మారుస్తారు. అందుకే ప్రతి చిన్నారి విద్యను అర్థం చేసుకుని, చక్కటి భవిష్యత్తును నిర్మించుకోవాలి.

దొరలు దోచలేరు దొంగలెత్తుకుపోరు/

భాతృజనము వచ్చి పంచుకోరు/
విశ్వవర్ధనంబు విద్యాధనంబురా /
లలిత సుగుణ జాల తెలుగు బాల/

అన్నారు శతకకర్త . విద్య అనే సంపదను దొరలు దోచుకోరు. దొంగలు దొంగిలించలేరు. అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు పంచుకుందామని విద్యలో భాగం అడగరు. ప్రపంచాన్ని అభివృద్ధి చేసేది విద్య మాత్రమే అని భావం.

ఈ కాలం విద్యార్థులు పై పద్యంలో చెప్పిన భావాన్ని అవగతం చేసుకుని చదువుకి అధిక ప్రాముఖ్యత ఇవ్వాలి. చదువుకునే వయసులో చదువుకి తప్ప మరే ప్రాధాన్యాలకు అవకాశం ఇవ్వకూడదు. కొందరు తాత్కాలిక ఆకర్షణల వైపు దారి మళ్లుతుంటారు . వ్యాపార ధోరణిలో తీసిన దిగజారుడు సినిమాల్లోని కథానాయకుల్లాగా అనుకరిస్తూ 'తగ్గేదే లే' అంటున్నారు . దీనివల్ల ఎవరికి నష్టం కలుగుతుందో ఆలోచించాలి. విలువైన విద్యా కాలాన్ని వృధా చేసుకుంటే గడిచిన క్షణకాలమైనా వెనక్కి తీసుకురాలేక చదువు అటకెక్కుతుంది. భవిష్యత్తు అంతా మూటలు మోసుకుంటూ, ఆటో నడుపుకుంటూ ఏడుస్తూ బతకాలి. అందుకే చౌకబారు సినిమాలు చూసి, అంతర్జాలంలో కవ్విస్తూ ఊరించే వీడియోలు చూసి లక్ష్యం నుండి పక్కదారి పట్టకూడదు. అసలు విద్యార్థులెలా ఉండాలో ఒక కథ చదువుదాం. విద్యార్థి ఎలా ఉండాలో తెలుస్తుంది.

అది లాహోర్ విశ్వవిద్యాలయం. 1892 వ సంవత్సరంలో బి. ఏ. గణిత శాస్త్ర పరీక్షలు జరుగుతున్నాయి . ప్రశ్నాపత్రంలో 13 ప్రశ్నలిచ్చి వాటిలో ఏ తొమ్మిదింటికైనా జవాబు రాయమని అడిగారు.

ఒక విద్యార్థి మాత్రం 13 ప్రశ్నలకు జవాబులు వ్రాసాడు. జవాబుల క్రింద పై వాటిలో ఏ తొమ్మిదింటికైనా మార్కులు వేయవచ్చు అని వ్రాశాడు. ఆ విద్యార్థికి విశ్వవిద్యాలయంలో ప్రథమ స్థానం వచ్చింది.

అలా రాసిన విద్యార్థి పేరే రామతీర్థ. దేశ విదేశాలలో పేరు గాంచిన తీర్థా రామ గోస్వామి. ఎం. ఏ. గణితం పూర్తి చేసి అధ్యాపకుడిగా మారాడు. తరువాత కాలంలో సన్యాసం స్వీకరించి , స్వామి రామతీర్థ గా పేరు మార్చుకుని అమెరికా, జపాన్, ఈజిప్టు, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో పర్యటించి భారతీయ వేదాంతాన్ని ప్రచారం చేసాడు.

చదువుకునే వయసులో విద్యార్థులు రామతీర్థ గారిని ఆదర్శంగా తీసుకోవాలి. కఠినమైన ప్రశ్నలు పరీక్షల్లో అడిగినా రాసే సత్తా కలిగి ఉండాలి. అలాంటి సత్తా , సాధనా శక్తి రావాలంటే విద్యా సంవత్సరం మొదటి నుండి గురువు చెప్పింది బడిలో శ్రద్ధగా వినాలి. తరగతి వాచకాలను, పాఠ్యాంశాలను ఆమూలాగ్రం చదవాలి. లోతుగా అవగాహన చేసుకోవాలి. చదువుని కాలక్షేపం కోసం కాకుండా భవిష్యత్తులో అనుభవించబోయే బంగారు జీవితం కోసం అన్న భావనతో చదవాలి. అలాంటివారికి అన్ని ప్రశ్నలకు జవాబులు రాసే సామర్థ్యం వస్తుంది. పరీక్షలకు ముందు రోజు రాత్రంతా చదివేసి పరీక్ష హాలుకి వెళ్లాక ఏదీ సరిగా గుర్తు రాక, ఏమి రాయాలో తెలియక ఇబ్బంది పడేవారు కొందరు, పరీక్ష టేబుల్ మీదనే నిద్రపోయిన వారు మరి కొందరున్నారు. అలాంటి వారికి ఒక విలువైన విద్యా సంవత్సరం వృధా అయిపోతుంది . అందుకే నిరంతర శ్రమ , నిత్య అధ్యయనంతోనే ఉన్నత స్థితికి చేరుకోగలరని, ఉత్తమ మైన స్థానం దక్కించుకో గలరని గ్రహించి తమ అలవాట్లను, పద్ధతుల్ని మార్చుకోవాలి విద్యార్థులు .

ఇప్పటి కాలంలో ఏ ఉద్యోగం పొందాలన్నా, స్వయం ఉపాధి కోసం బ్యాంకుల నుండి అప్పు తీసుకోవాలనుకున్నా కూడా కనీస విద్యార్హతలు అవసరమన్న నిబంధనలు ఉన్నాయి. అందువల్ల విద్య అవసరం తెలుసుకుని అభ్యసిస్తున్న వారు పెరిగారు. అదీ మంచిదే .

పూర్వకాలంలో పరిపాలకులు, రాజులు తగిన విద్యార్హతలను పొందిన తరువాతే రాజ్య పట్టాభిషేకం స్వీకరించేవారు. రాజనీతి శాస్త్రం, యుద్ధనీతి వంటి శాస్త్రాలలో ఉత్తీర్ణులైన వారే పదవుల్లోకి వచ్చేవారు. అలాంటి కాలంలో ఒక రాజుగారు తన పిల్లలకు విద్య అబ్బలేదని బాధ పడేవారు. వాళ్ళని విద్యాధికులుగా చూడాలని తపన పడ్డారు. తన తరువాత రాజ్యపాలన చేయబోయే కుమారులకు విద్య నేర్పమని పండితులను ప్రాధేయపడిన ఒక కథ చదువుదాం.

మహిళారోప్య నగర పాలకుడైన అమరశర్మకు ముగ్గురు కొడుకులు. వాళ్లలో ఏ ఒక్కరికీ విద్యాబుద్ధులు అబ్బలేదు . ఒకరోజు ఆస్థాన పండితులతో రాజుగారు తన మనసులోని మాటలను చెప్పాడు. “నా ముగ్గురు కొడుకుల్ని చూడండి. చదువు సంధ్యలు లేకుండా తిరుగుతున్నారు. ఒక్కరికి కూడా పొట్ట పొడిస్తే అక్షరం ముక్క రాదు. నాకు వృద్ధాప్యం వచ్చి మరణిస్తే మన రాజ్య భారాన్ని ఇలాంటి అయోగ్యులకు అప్పగించాలి. తరువాత జరగబోయేది తలచుకుంటేనే భయం కలుగుతోంది. మీలో ఎవరైనా రాకుమారులకు విద్యా బోధ చేసి తెలివైన వారిగా మార్చగలరా” అనడిగాడు.

అక్కడున్న పండితుల్లో ఒక్కరూ ఆ విషయంలో సాయం చేస్తామని మాట ఇవ్వలేకపోయారు. రాజ కుమారులు గాలికి తిరగడం చూసిన పండితులకు ధైర్యం సరిపోలేదు. రాజు గారు చెప్పిన బాధ్యత ఎంత కష్టమైనదో వాళ్లకి తెలుసు.

అప్పుడే సభలోకి అడుగుపెట్టిన విష్ణుశర్మ అనే పండితుడు రాజుగారి ముందుకు వచ్చి “నేను రాకుమారులకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుల్ని చేస్తాను” అంటూ ఆ బాధ్యతను స్వీకరించాడు . రాజకుమారుల్ని తన పద్ధతిలో ప్రయత్నం చేసి తెలివైన వారిగా తయారు చేస్తానన్నాడు.

ఆ రాజుగారి కుమారులు ముగ్గురూ రోజంతా పావురాలను ఎగరవేరుస్తూ ఆడుకుంటారు. వారికి అదే వ్యాపకం . విష్ణుశర్మ వాళ్ళ దగ్గరకు వెళ్లి తాను కూడా పావురాలు ఎగరవేయడం ప్రారంభించాడు.

వాళ్ళతో స్నేహం చేసి స్నేహితుడని నమ్మకం కలిగించాడు. వాళ్ళు అతడి మాటలు నమ్మి చెప్పినవన్నీ పాటిస్తున్నారని తెలిసాక, వారికి పోటీ పెట్టి గెలిచిన వాళ్లకి తీపి పదార్థాలు బహుమతులుగా ఇస్తానన్నాడు.

పోటీ ఏమిటో చెప్పమని రాజకుమారులు అడిగినప్పుడు విష్ణుశర్మ “ ఇదిగో… ఈ భాషలో అక్షరాలు ఇలా ఉంటాయి. ఇది ‘అ ‘, ఇది ‘ఆ’, ఇది’ ఇ’, ఇది ‘ఈ’. ఈ అక్షరాలలో ఒక్కొక్కటి ఒక్కొక్క అట్ట మీద వ్రాసి పావురాల కాళ్లకు కట్టి ఎగరవేస్తాను. మీలో ‘క’ అక్షరం గల పావురం తెచ్చిన వాళ్లకి బహుమతి ఇస్తాను” అని చెప్పాడు. ఆట అనగానే రాజకుమారుల్లో ఉత్సాహం హెచ్చింది. నవ్వుతూ , గెంతుతూ తలా ఒక దారిన పరిగెత్తి ‘క’ అక్షరం రాసి ఉన్న పావురాన్ని వెతికారు. అలా విష్ణుశర్మ చెప్పిన బహుమతులు

పొందడం కోసం భాషలో ఉన్న అక్షరాలు తెలుసుకున్నారు. పావురాలతో ఆడుకునే అజ్ఞానులకు అక్షరాలు, మాటలు క్రమంగా నేర్పాడు విష్ణుశర్మ. ఆఖరికి పంచతంత్రం అనే జంతువులు, పక్షులు— పాత్రలుగా గల కథలు చెప్పి వాళ్ళను రాజ నీతిజ్ఞులుగా తయారు చేశాడు.

'తెలిసిన దాని నుండి ఆరంభించి తెలియని దానికి తీసుకుపోవడం' from known to unknown' అనే విద్య యొక్క నియమాన్ని అనుసరించి విద్యా బోధన చేసి వాళ్లను తెలివైన వాళ్ళుగా మార్చి విజయం సాధించాడు విష్ణుశర్మ. అలా సృష్టించబడిన పంచతంత్ర కథలు ఎంతగా ప్రసిద్ధి పొందాయో మనందరికీ తెలిసిందే .

"ఆ కాలంలో కాబట్టి విష్ణుశర్మ చెప్పింది పిల్లలు విన్నారు. ఈ కాలంలో పిల్లలకు అది సరిపోదు. '**తగ్గేదే... లే'** అని సినిమాల్లో చూపించినట్టు గడ్డం క్రింద చెయ్యి తిప్పుకున్నారనే" అభిప్రాయం ఉన్నట్టయితే అది అపోహ మాత్రమే . ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. ఒకటి కాకపోతే ఇంకోటి అన్నట్టు వేరే మార్గంలో ప్రయత్నించాలి. తాళం చెవి తయారు చెయ్యకుండా తాళం కప్ప తయారవ్వదు. అలాగే పరిష్కారం లేని సమస్య ఉండదు. ఏ విద్యార్థికి ఎలాంటి శిక్షణ అవసరమో గురువులు తెలుసుకుని ప్రయత్నించాలి. అందుకే కదా ప్రభుత్వం వాళ్లని నియమించింది.

మన సమాజంలో ప్రస్తుతమున్న గురువులు ఉన్నతమైన చదువుల్ని చదివి , పేరున్న విద్యాసంస్థల నుండి ఉత్తీర్ణులై, అత్యుత్తమ సంస్థల ద్వారా ఉపాధ్యాయ శిక్షణ పొందినవారే. అలాంటి ఉపాధ్యాయులు తలచుకుంటే విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించి, చదువులు చదివేలా చేయడం సులువవుతుంది. అప్పటి కాలానికి విష్ణుశర్మ అనుసరించిన పద్ధతి ఇప్పటి కాలానికి సరిపోకపోవచ్చు. అయితే ఏం? ఉపాయం ఉంటే ఊళ్ళేలవచ్చు అన్నట్టు అనేక విధాలుగా ఆలోచిస్తే పరిష్కార మార్గాలు దొరుకుతాయి. విద్యార్థులకున్న ఆసక్తులు, అభిరుచులు, ఇష్టాలను కనిపెట్టి వాళ్ళని తమ వైపు ఆకట్టుకోవడం తెలియాలి. కంప్యూటర్ , శాస్త్ర విజ్ఞానం ఇంతగా వ్యాప్తి చెందని కాలంలోనే విష్ణుశర్మ చిత్తశుద్ధితో ప్రయత్నించి రాజకుమారులను బడుద్ధాయిలు నుండి ప్రజ్ఞావంతులుగా మార్చాడంటే ఈ కాలం గురువులు, తల్లిదండ్రులు చిత్తశుద్ధితో ప్రయతిస్తే సాధ్యం కానిది ఉంటుందా?

ఒక ప్రముఖుడు ఉపన్యసిస్తున్నప్పుడో, ఇద్దరు పండితులు మాట్లాడుతున్నప్పుడో వారి మాటల్లో జంతు పాత్రలున్న పంచతంత్ర కథలు, ఈసఫ్ కథలు ప్రస్తావిస్తున్నారంటే అది ఆ కథల గొప్పతనమే కదా. అంతేకాదు తెలుగు వాచకాల్లో ఆ కథలను చేర్పించి పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్నారన్నా , అలాంటి జంతు పాత్రలతో ఉన్న కథలను ఈనాడు వంటి ప్రముఖ దినపత్రిక ప్రచురిస్తుందన్నా కారణం విష్ణుశర్మ గారి పంచతంత్రం చూపిన ప్రభావమే.

మరో కోణం నుంచి ఆలోచిస్తే తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యం నుండే మంచి అలవాట్లు నేర్పుతూ, విద్య పట్ల ఆసక్తిని పెంచాలి. టీవీ సీరియల్స్ చూసుకుంటూ తల్లి , మొబైల్ వీడియోలు

చూసుకుంటూ తండ్రి కూర్చుంటూ,  పిల్లలను చదవమంటే చదువు మీద దృష్టి నిలపలేరు . కాబట్టి పెద్దవాళ్ళు కొన్ని త్యాగాలకు సిద్ధపడాలి . తమ జీవితంలో సంతోషాన్నిచ్చేవిగా భావిస్తున్న టీవీ, మొబైల్ వినియోగం పరిమితం చేసుకుని పిల్లల చదువే ముఖ్యమనుకుని కొన్నేళ్లపాటు ప్రవర్తించాలి. విద్య మీద పిల్లలకు ఆసక్తి కలిగిస్తే వాళ్లలో తప్పక పురోగతి ఉంటుంది. పెద్దలు చేసిన ఇలాంటి త్యాగాలన్నీ కలిపితే పిల్లాడి భవిష్యత్తు తేజోమయం కావడం కంటే చిన్నపే కదా.

విద్య విలువ, ప్రయోజనం, నేర్పించే పద్ధతులు, విద్యాధికులు సాధించిన విజయాలు వంటివి ఇంతవరకు తెలుసుకున్నాం. అయితే విద్య నేర్చుకున్న తరువాత విద్యార్థులెలా ప్రవర్తించాలో తెలిపే పద్యం భాస్కర శతకంలో ఉంది. దాన్ని చదువుదాం.

చదువది యెంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న నా/

చదువు నిరర్థకంబు గుణ సంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్/

పదునుగ మంచికూర నలపాకము చేసినైన నందు ఇం/

పొదవెడు ఉప్పు లేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా।

అంటాడు శతకకర్త .

విద్య ఎంత బాగా నేర్చినా రసగ్రహణ యోగ్యత లేశమైనా లేకపోతే ఆ విద్య నిష్ప్రయోజనం. అలాంటి విద్యను గుణవంతులు ఎవ్వరూ ఎక్కడా మెచ్చుకోరు. నలుడు చేసినంత అద్భుతంగా , చాకచక్యంగా వంట చేసినా సరే ఆ కూరలో ఉప్పు లేకపోతే అది రుచి అనిపించదు. ఎవ్వరూ ఇష్టంగా తినలేరు కదా అని భావం.

చదువు నేర్చుకోగానే సరిపోదు. చదువుతో బాటు చతురత, వివేకం కలిగి ఉండాలి. చదివిన చదువును సందర్భోచితంగా వినియోగించే చాకచక్యం, సమయస్ఫూర్తి తెలిసి ఉండాలి. అప్పుడే ఆ చదువుకు తగిన గౌరవం దక్కుతుంది. లేకపోతే ఎంత చదువున్నా ఏం లాభం? బూడిదలో పోసిన పన్నీరు లాగా నిరుపయోగమవుతుంది.

“విద్య వల్ల వినయం, వినయం వల్ల వ్యక్తిత్వం , వ్యక్తిత్వం వల్ల దానం, దానం వల్ల ధర్మం, ధర్మం వల్ల సుఖం లభిస్తాయన్న” మహాత్మా గాంధీ మాటలు నిజం చేసేలా నిజ జీవితంలో ఉత్తమ వ్యక్తిత్వం నిర్మించుకోవాలి దేశ యువత.

“చదువంటే బోలెడంత సమాచారాన్ని బుర్రలోకి పంపి దాన్ని జీర్ణించుకోలేక కింద మీదులవడం కాదు. జీవితాన్ని నిర్మించి మనిషిని తీర్చిదిద్ది వ్యక్తిత్వాన్ని రూపొందించే సదాలోచనల ఖజానాగా విద్యా

విధానం ఉండాలి . మంచి ఆలోచనల్ని పుణికి పుచ్చుకొని నువ్వు , నీ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దు కోగలిగితే మొత్తం గ్రంథాలయాన్ని కంఠస్థం చేసిన వాడి కన్నా నువ్వే ఎక్కువ చదివినట్టు" అంటారు స్వామి వివేకానంద.

వివేకానందుడు సూచించినట్టుగా చక్కని వ్యక్తిత్వాన్ని రూపొందించేలా మన విద్యా విధానం రూపుదిద్దుకోవాలి. అందుకు తల్లిదండ్రులు, గురువులు, సమాజంలోని పాలకులు కృషి చేయాలి. అప్పుడే వ్యక్తిగత పురోభివృద్ధి పొందడంతో బాటు దేశప్రగతికి యువత తోడ్పడగలదు.

"విద్య మన హక్కు, మన భవిష్యత్తు!" అన్నది తెలుసుకోవాలి. విద్య మన జీవితానికి చాలా ముఖ్యం. కాబట్టి బాగా చదవండి. జ్ఞానాన్ని సంపాదించండి. జీవితంలో విజయవంతం అవ్వండి.

——---******-------